

సద్వినియోగం చేసుకోవాలి

వేములవాడరూరల్: దళితబంధు యూనిట్లను సద్వినియోగం చేసుకోవాలని పశువైద్యాధికారి కొమురయ్య కోరారు. శాత్రాజుపల్లి, నమిలిగుండుపల్లి, వట్టెంలలో పరిశీలించారు.



స్వల్పంగా పెరిగిన పత్తి ధర

జమ్మికుంట(హుజూరాబాద్): జమ్మికుంట వ్యవసాయ పత్తి మార్కెట్లో పత్తి క్వింటాల్‌కు రూ.8,400 పలికింది. మార్కెట్‌కు 386 క్వింటాళ్ల పత్తిని రైతులు తీసుకొచ్చారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం
29.0/16.0

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. జిల్లాలో వర్షం కురిసే అవకాశం స్వల్పంగా ఉంది. గాలిలో తేమ అధికంగా ఉంటుంది. ఈదురుగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

ఇంటి నిర్మాణానికి రూ.5లక్షలు ఇవ్వాలి



సిరిసిల్లటౌన్: డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లకు అర్హులుగా ఉండి డ్రాలో పేరు రాని నిరుపేదలకు ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ బుధవారం సీపీఎం ఆధ్వర్యంలో మంత్రి కేటీఆర్‌కి పోస్టుకార్డులు పంపారు. దాదాపు 500 మంది నిరుపేదలు పోస్టుకార్డులతో స్థానిక ఆర్డీవో కార్యాలయం నుంచి పోస్టాఫీస్ వరకు ర్యాలీగా వెళ్లి కార్డులను పోస్టుబాక్స్‌లో వేశారు. మూశం రమేశ్ మాట్లాడుతూ సిరిసిల్లలో చాలా మంది నిరుపేదలు సొంతిళ్లు లేక అద్దె ఇళ్లలో మగ్గుతున్నారన్నారు. సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు కోడం రమణ, సూరం పద్మ, మోర అజయ్, గోవిందు లక్ష్మణ్, రాజశేఖర్ నక్క దేవదాస్, కవిత, వీరేశం, రాజశేఖర్, స్వప్న, నవీన్, బాబు ఉన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించండి



సిరిసిల్లటౌన్: సైజింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించే వరకు పోరాడుతామని సైజింగ్, డైయింగ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు కిశోర్ పేర్కొన్నారు. సిరిసిల్లలో బుధవారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. సైజింగ్‌కార్మికులు, యజమానులకు మధ్య జరిగిన చర్చలు విఫలమయ్యాయని, యజమానుల మొండి వైఖరిని నిరసిస్తూ నిరవధిక సమ్మెకు వెళ్తున్నట్లు తెలిపారు. ఎలగేటి రాము, సోమిశెట్టి దశరథం, కొముర‌య్య, దేవదాసు, వెంకటేశం, రమేశ్, ప్రకాశ్, యూసుఫ్, తిరుపతి ఉన్నారు.

వేములవాడ ఆస్పత్రిలో కాయకల్ప బృందం తనిఖీ



వేములవాడఅర్బన్: వేములవాడ ఏరియా ఆస్పత్రిని కాయకల్ప వైద్యబృందం సభ్యులు బుధవారం పరిశీలించారు. ఆస్పత్రిలో రోగులకు అందుతున్న సేవలు, పరిశుభ్రత, పరిసరాల నిర్వహణ, సిబ్బంది పనితీరు, విద్యుత్ వినియోగం, వ్యర్థాల సేకరణ, పచ్చదనానికి ప్రాధాన్యత ఇలా సుమారుగా 10 విభాగాల్లో పరిశీలించారు. బృంద సభ్యులు వెంకటలక్ష్మీ, అనురాధ, నాగరాణి, స్నేహలత, ఐసీఎస్ రాజునాయక్ పరిశీలించారు. వారివెంట ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రేగులపాటి మహేశ్‌రావు, డాక్టర్ అనిల్‌కుమార్, డాక్టర్‌లు సంతోష్‌చారి, వెంకట్, సందీప్, నవీన్ ఉన్నారు.

బ్యాక్టీరియాపై క్షేత్ర ప్రదర్శన



వేములవాడరూరల్: వేములవాడ మండలంలోని బొల్లారంలో ఏడీఏ భాస్కర్ ఆధ్వర్యంలో భూసారం కరిగించే బ్యాక్టీరియాపై క్షేత్ర ప్రదర్శన చేపట్టారు. గ్రామంలోని టెంకురాల అశోక్ వ్యవసాయ క్షేత్రంలో రైతులకు అవగాహన కల్పించారు. ఏవో అనూష, విస్తరణ అధికారి సందీప్, రైతులు పాల్గొన్నారు.

దేశాయిపల్లిలో ఆర్డీవో ఇంటింటి సర్వే

బోయినపల్లి(చొప్పదండి): కాళేశ్వరం ప్రాజెక్టు అదనపు టీఎంసీ వరదకాల్వ నిర్మాణంలో ముంపునకు గురవుతున్న మండలంలోని దేశాయిపల్లిలో బుధవారం వేములవాడ ఆర్డీవో పవన్‌కుమార్, తహసీల్దార్ నరేశ్‌తో కలిసి ఆర్‌అండ్‌ఆర్ జాబితాపై ఇంటింటి సర్వే నిర్వహించారు. వరదకాల్వ నిర్మాణంలో గ్రామంలో పలు ఇళ్లు ముంపునకు గురవుతున్నాయి. గ్రామంలో ముంపునకు గురవుతున్న కుటుంబాలకు సంబంధించిన గెజిట్ ప్రచురణలో భాగంగా ఇళ్లను సందర్శించి మోకా పరిశీలించినట్లు తెలిసింది. ఇంట్లోని సభ్యుల ఆధార్‌కార్డుల వివరాలు పరిశీలించారు. నేడో, రేపో దేశాయిపల్లి పీడీఎఫ్‌ల గెజిట్ పబ్లికేషన్ చేస్తారని చర్చించుకుంటున్నారు.

చందాల దందా !

- 'పాలిస్టర్'ను పిండేస్తున్నారు !
- కొత్తగా రూ.2.25 కోట్ల వసూళ్లకు ఒత్తిళ్లు
- అధికార పార్టీ నేతల అరాచకాలు !
- అప్పుల ఊబిలోకి అసోసియేషన్లు
- ఒత్తిడికి గురవుతున్న వ్యాపారులు

సిరిసిల్ల: రాజన్నసిరిసిల్ల జిల్లా కేంద్రంలో రాజకీయాలు వస్త్ర ఉత్పత్తిదారుల చుట్టే తిరుగుతుంటాయి. ఉపాధి చూపెట్టిన వారికే.. చందాలు వసూలు చేసిన వారి నుంచే అన్నట్లుగా పరిస్థితులు మారాయి. సామాజిక సేవ, ధార్మిక వేడుకల సమయంలో చందాలు వసూలు చేయడం సర్వసాధారణం. కానీ సిరిసిల్ల జిల్లా కేంద్రంలో కార్యక్రమం ఏదైనా పాలిస్టర్ అసోసియేషన్ లక్ష్యంగా మారుతుంది. కొత్తగా రూ.2.25 కోట్ల వసూళ్ల లక్ష్యంగా అధికార పార్టీ నేతలు ఒత్తిడి చేస్తుండడంతో చందాల దందా మరోసారి వెలుగులోకి వచ్చింది.

పేరుకే పాలకవర్గం.. పెత్తనమంతా వారిదే..

సిరిసిల్లలో పాలిస్టర్ వస్త్రోత్పత్తిదారులు పాతికేళ్ల కిందట పాలిస్టర్ అసోసియేషన్‌ను ఏర్పాటు చేశారు. కొత్తబస్టాండు సమీపంలో స్థలాన్ని కొని, 2010లో అందమైన భవనాన్ని సొంత డబ్బులతోనే నిర్మించుకున్నారు. ఐదేళ్ల కిందటి వరకు 150 మంది సభ్యులు గల ఆ అసోసియేషన్ రూ.లక్షల సొమ్ము నిల్వతో ఆర్థికంగా బలంగా ఉండేది. గత నాలుగేళ్లుగా ఆ సంఘం పాలకవర్గం ఎవరున్నా పెత్తనమంత అధికార పార్టీ నేతలదిగా మారింది. దీంతో పాలిస్టర్ అసోసియేషన్ ఇప్పుడు అప్పుల్లో కూరుకుపోయింది. అధికార పార్టీ నేతల ఒత్తిళ్లతో చందాల రూపంలో లక్షల రూపాయలు ఇవ్వాల్సి రావడంతో ఆర్థిక మూలాలు దెబ్బతిన్నాయి. కొత్తగా సిరిసిల్లలో వస్త్రోత్పత్తి చేసే 142 ఎస్ఎస్ఐ (చిన్న తరహా పరిశ్రమలు) ఒక్కొక్కరి వద్ద రూ.లక్ష చొప్పున, 139 మ్యాక్స్ సంఘాల వద్ద రూ.50వేల చొప్పున మొత్తంగా రూ.2.11 కోట్ల నుంచి రూ.2.25 కోట్ల వరకు వసూలు చేయాలని అధికార పార్టీ నేతలు నిర్ణయించారు. ఈమేరకు ఇటీవల జరిగిన పాలిస్టర్ అసోసియేషన్ సమావేశంలో హుకూం జారీ చేయడంతో వస్త్రోత్పత్తిదారులు అవాక్కయ్యారు.



సిరిసిల్ల పాలిస్టర్ అసోసియేషన్ భవనం



పాలిస్టర్ వస్త్రం తయారయ్యే లారీలో నూలు

లెక్కలు లేవు.. బుక్కులు కనిపించవు

వాస్తవానికి వస్త్రోత్పత్తిదారులు సిరిసిల్లకు దిగుమతి చేసుకున్న నూలు(ధారం) ఆధారంగా ఒక్క లారీకి రూ.1,500 నుంచి రూ.2,500 వరకు పాలిస్టర్ అసోసియేషన్ వసూలు చేస్తుంది. అసోసియేషన్‌లో నిధులు ఉండాలని ఈ సొమ్మును జమచేస్తారు. మరోవైపు ఉత్పత్తి చేసిన వస్త్రం మీటరుకు ఐదు నుంచి పది పైసలు చొప్పున వసూలు చేసి నిధి సమీకరిస్తారు. ఇలా సమీకరించిన డబ్బులతో అసోసియేషన్ సంక్షేమం, అభివృద్ధి పనులు చేయాలి. కానీ గత ఐదేళ్లుగా అభివృద్ధి, సంక్షేమం మాటే లేదు. వసూలు చేసిన డబ్బులకు లెక్కలు లేవు. రికార్డు బుక్కులు కనిపించవు.

అంతా గుట్టుచప్పుడు కాకుండానే..

సిరిసిల్లలో పలు అసోసియేషన్లు ఇలా చందాల ఒత్తిళ్లతో నిర్వీర్యమయ్యాయి. చందాలు వసూలు చేయడం.. ఆ విషయం బయటకు చెప్పొద్దని బెదిరించడం పరిపాటిగా మారింది. పొరపాటున బయటపడితే.. అంతా తప్పే.. మేమే స్వచ్ఛందంగా ఇచ్చామంటూ వివరణ ఇవ్వాలని ఆ సంఘం నాయకులపై ఒత్తిడి చేస్తున్నారు. ఏది ఏమైనా హైదరాబాద్ స్థాయిలోని అధికారుల పేర్లు చెప్పడం, అందినకాడికి నొక్కేయడం అధికార పార్టీ నేతలకు అలవాటుగా మారింది. వారిని కాదంటే.. ప్రభుత్వ స్థాయిలో పనులు కావేమో అనే భయంతో పలువురు వస్త్రోత్పత్తిదారులు తాజా పరిణామాలకు తలలు బాదుకుంటున్నారు.

నిధులు ఇలా పోతున్నాయి

- రెండేళ్ల కిందట అధికార పార్టీ నేత వివిధ ఖర్చుల కోసం రూ.60 లక్షలు అసోసియేషన్ నుంచి తీసుకుని రాష్ట్రస్థాయిలో కీలక అధికారులకు ఇచ్చినట్లు చెప్పి చేతులు దులుపుకున్నాడు.
- అంతకుముందు అధికార నేతకు ఆత్మీయ సత్కారం పేరిట మరోసారి రూ.80లక్షలు అసోసియేషన్ సొమ్మును నీళ్లలో పోశారు.
- ఇటీవల సిరిసిల్లలో రాష్ట్ర కబడ్డీ పోటీలకు అసోసియేషన్ కొంత మేరకు డబ్బులను సమకూర్చింది.
- మొన్ననే సిరిసిల్లకు చెందిన ఓ నేతకు రాష్ట్రస్థాయి పదవి వస్తే.. ప్రమాణ స్వీకారానికి రూ.5 లక్షలు ఇదే సంఘం సమకూర్చింది. కానీ తామే స్వచ్ఛందంగా ఇచ్చామని ఆ తరువాత అదే సంఘం పెద్దలతో ఖండన ఇప్పించారు.
- సామాజికాంశాలకు, సంక్షేమానికి చందాలు ఇవ్వడాన్ని ఎవరూ తప్పు పట్టడం లేదు. కానీ అధికార పార్టీ నేతలు లెక్కలు చెప్పకుండా రూ.లక్షల్లో అసోసియేషన్ సొమ్మును తీసుకెళ్లడం విమర్శలకు తావిస్తోంది. తాజాగా రూ.2.25కోట్లకు ప్రణాళిక సిద్ధం చేయడం వివాదాస్పదమవుతోంది. బతుకమ్మ చీరల ఆర్డర్లు ఇస్తున్నా.. అధికార పార్టీ నేతలకు ఆ మాత్రం ఇస్తే ఏమవుతుందని అని సదరు నేతలిద్దరూ దబాయించడం కొసమెరుపు. చాలా కాలంగా అసోసియేషన్ వ్యవహారాలు చూసిన ఓ పెద్దమనిషి ఈ వసూళ్ల కంటే.. గతంలో 'అన్నలే(నక్సలైట్లు) నయం.. చిట్టీరాసి.. బెదిరించి.. భయం భయంగా వచ్చి ఎంత ఇస్తే అంత తీసుకెళ్లే వారు' అంటూ.. పేర్కొనడం అధికార పార్టీ నేతల ఒత్తిళ్లకు అద్దం పడుతోంది.

స్వచ్ఛ సర్వేక్షణ్‌లో దేశంలోనే జిల్లా అగ్రస్థానం

- ప్రకటించిన కేంద్ర ప్రభుత్వం

సిరిసిల్ల: స్వచ్ఛభారత్ మిషన్(గ్రామీణ)లో భాగంగా స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ 2022 డిసెంబర్‌లో ఇచ్చిన పారామీటర్ల ఆధారంగా దేశంలోనే రాజన్న సిరిసిల్ల జిల్లా 4 స్టార్ ర్యాంకింగ్ విభాగంలో మొదటి స్థానం దక్కించుకుంది. నవంబర్ నెలలో దేశంలోనే ప్రథమస్థానంలో నిలవగా, తాజాగా డిసెంబర్‌లోనూ ఆ స్థానాన్ని నిలబెట్టుకుంది. ఈ విషయాన్ని కేంద్ర ప్రభుత్వ తాగునీరు–పారిశుధ్య మంత్రిత్వశాఖ ట్విట్టర్‌లో పోస్టు చేసింది. జిల్లాలోని అన్ని గ్రామాలను ఓడీఎఫ్ ప్లస్ కేటగిరీలో మోడల్ గ్రామాలుగా డిక్లేర్ చేసినందుకు దేశంలోనే అగ్రస్థానం దక్కించుకుంది. ఐటీ, మున్సిపల్‌శాఖ మంత్రి కేటీఆర్ మార్గనిర్దేశనంలో కలెక్టర్ అనురాగ్ జయంతి సారథ్యంలో జిల్లా అధికారులు తీసుకున్న చర్యలు జిల్లాకు అరుదైన గౌరవం దక్కింది. జిల్లా దేశంలోనే అగ్రస్థానంలో నిలిచినందుకు జిల్లా అధికారులను కలెక్టర్ అనురాగ్ జయంతి అభినందించారు. జిల్లా ఈ స్థానంలో నిలిచేలా కృషి చేసిన వారి సేవలను గుర్తు చేసుకుంటూ జిల్లాలోని అన్ని మండలాల్లో వేడుకలు నిర్వహించాలని కలెక్టర్ కోరారు. ఇదే స్ఫూర్తితో ముందుకెళ్తూ జిల్లాను భవిష్యత్‌లోనూ అగ్రస్థానంలో నిలపాలని కోరారు.

కేంద్ర మంత్రిత్వశాఖ ప్రశంసలు

స్వచ్ఛ సర్వేక్షణ్‌లో డిసెంబర్ నెలలో జిల్లాను అగ్రస్థానంలో నిలిపిన రాజన్నసిరిసిల్ల జిల్లా అధికారులకు కేంద్ర తాగునీరు–పారిశుధ్య మంత్రిత్వశాఖ ప్రశంసలు తెలియజేసింది.

డీపీవో సిబ్బందికి ప్రశంసలు

కరీంనగర్: జిల్లా పోలీసుశాఖలోని హ్యూమాన్ రీసోర్స్ మేనేజ్‌మెంట్ సిస్టం(హెచ్‌ఆర్‌ఎంఎస్) అప్లికేషన్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన జిల్లా పోలీస్ కార్యాలయ సిబ్బందికి ఎస్పీ రాహుల్‌హెగ్డే బుధవారం ప్రశంసాపత్రలు అందజేశారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో పోలీస్ అధికారులు, సిబ్బంది సర్వీస్‌కు సంబంధించిన పూర్తి వివరాలు అప్లికేషన్‌లో పొందుపరచడానికి కృషి అభినందనీయమన్నారు. పోలీస్‌శాఖలో కాగిత రహిత సేవలందించేందుకు అత్యంత సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన హెచ్‌ఆర్‌ఎంఎస్ అప్లికేషన్‌ను తీసుకొచ్చినట్లు తెలిపారు. అదనపు ఎస్పీ చంద్రయ్య, అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ అహ్మదుల్లాఖాన్ తదితరులు పాల్గొన్నారు.

అంతా మా ఇష్టం..!

- 'నో' నంబర్ ప్లేట్
- అదనంగా పోలీసు సైరన్
- ఓవర్ స్పీడ్.. నిబంధనలకు తూట్లు
- వాహనదారుల ఇష్టారాజ్యం

సిరిసిల్లక్రైం: రాజన్నసిరిసిల్ల జిల్లాలో కొందరు వాహనచట్టం నిబంధనలకు తూట్లు పొడుస్తున్నారు. నంబర్‌ప్లేట్ లేకుండా ఇష్టారీతిగా రోడ్లపైకి వస్తున్నారు. అతివేగంగా వాహనాలు నడుపుతూ ప్రమాదాలకు కారణమవుతున్నారు. ఈ సందర్భంలో ప్రమాదాలు చేసిన వారిని పట్టుకోవడం ఇబ్బందిగా మారుతుంది. ఇలాంటి వాహనాలకు బీమా లేకపోవడంతో క్షతగాత్రులకు కనీసం ఆర్థికసాయం అందడం లేదు. ఇదంతా సామన్యులు చేస్తున్న తతంగం అనుకుంటే పొరపాటే. గ్రామీణ ప్రాంతాల్లో ఉండే రైతులు, నిరక్షరాస్యులు పోలీసులు తనిఖీ చేస్తారన్న భయానికి వాహన నిబంధనలు పాటిస్తున్నారు. ఇక సమస్య ఎటొచ్చి చదువుకున్న యువకులు, వివిధ హోదాల్లో ఉన్న బడాబాబులతోనే పరేషాన్ అని ట్రాఫిక్ పోలీసులు చెబుతున్నారు. రాజకీయ నాయకులు లక్షల రూపాయలు వెచ్చించి కార్లకు నంబర్‌ప్లేట్ లేకుండా తిరగడం ఫ్యాషన్‌గా ఫీలవుతున్నారని, ఇదేమని అడిగితే బెదిరింపులకు పాల్పడుతున్నట్లు వివిధ సందర్భాల్లో మాటలు పడిన పోలీసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నంబర్ ప్లేట్ ఉంటేనే రోడ్డు మీదకు..

ఏదేని వాహనాన్ని కొంటే దానికి సంబంధిత కంపెనీ 15 నుంచి 30 రోజులపాటు టెంపరరీ రిజిస్ట్రేషన్ నంబర్ కేటాయిస్తుంది. ఈ సమయం ముగియగానే విధిగా యజమాని ఆ వాహనాన్ని ఆర్టీవో కార్యాలయంలో మళ్లీ పర్మినెంట్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. కొత్తవాహనాలకు సదరు కంపెనీలు ఇటీవల కొనుగోలు సమయంలో ఐదేళ్ల కోసం ఇన్సూరెన్స్ డబ్బులు తీసుకుంటున్నాయి. ఇది వాహనాదారులకు ఉపయోగపడాలి అంటే విధిగా వాహనాన్ని రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. కాగా ఇన్సూరెన్స్ కోసం రిజిస్ట్రేషన్ చేసుకుంటున్న వారిలో అనేక మంది ఆ నంబర్‌ను వాహనాలకు బిగించడం లేదు. నంబర్ ప్లేట్ లేకుండా తిరగడం వీఐపీలుగా ఫీలవుతున్నారు.

పొలిటికల్ లీడర్ల.. పోలీసు సైరన్ !

ప్రజాసేవ చేయడానికి ప్రజాక్షేత్రంలో ఉన్న వారు ఆదర్శంగా ఉండాల్సింది పోయి.. ఇష్టారీతిగా వ్యవహరిస్తున్నారు. అధికారాన్ని దుర్వినియోగం చేస్తూ.. నంబర్‌ప్లేట్స్ బిగించుకోక పోగా.. పోలీస్‌సైరన్ ఏర్పాటు చేసుకుంటున్నారు. ఇటీవల రాష్ట్రస్థాయి పదవి వచ్చిన ఓ నేతతోపాటు, మరో నేత నంబర్ ప్లేట్ లేకుండానే వాహనంలో వెళ్తుంటే.. మరో నేత నంబర్‌ప్లేట్‌తోపాటు ఎమ్మెల్యే స్టిక్కర్ పెట్టి దర్జాగా అధికారిక సభలకు హాజరవుతున్నారు. ఈ విధానాన్ని చూసిన ప్రతిపక్ష పార్టీల్లోని చోటామోటా నాయకులు వాళ్లకో రూల్ తమకో రూల్ ఎలా అని విధుల్లో ఉన్న ట్రాఫిక్ పోలీసులను ప్రశ్నిస్తున్నట్లు తెలిసింది.

జరిమానాలకు భయపడి

టాక్సీ ప్లేట్ ఉన్న వాహనాలు 60 నుంచి 80 స్పీడ్‌కు మించరాదని, వ్యక్తిగత వాహనాలు 80 స్పీడ్ మించరాదన్న నిబంధనలున్నాయి. కానీ ఈ స్పీడ్ తమకు కాదన్న విధానంలో లీడర్ల వాహనాలు జిల్లాలోని రోడ్లపై తిరగుతున్నాయి. ఇలాంటి సమయంలో సీసీ కెమెరాలు, స్పీడ్‌గన్స్‌కు దొరికితే.. వచ్చే జరిమానాలకు భయపడడంతోపాటు వివిధ సందర్భాల్లో హైదరాబాద్ వెళ్లడానికి టోల్‌టాక్స్‌కి ఎగనామం పెట్టేందుకు నంబర్ తీసేసి వెళ్తున్నట్లు సమాచారం. ఇక జిల్లాలో ట్రాక్టర్లకు నంబర్‌ప్లేట్లు ఉండడమే ఒక మహాద్భుతంగా మారింది. ఇసుక రవాణా, దొంగ సరుకుల రవాణా అంతా వీటిద్వారానే సాగుతోంది.



నంబర్ ప్లేట్ లేకుండా తిరుగుతున్న కారు

జిల్లాలో వాహనాలు..

ఆటోలు	3,267
కార్లు	9,690
బైక్స్	86,038
గూడ్స్ క్యారియర్స్	3,079
ట్రాక్టర్స్	4,986

పట్టుబడితే చట్టపరిధిలో చర్యలు

వాహనచట్టం ప్రకారం నంబర్‌ప్లేట్ ఉండాలి. ట్రాఫిక్ అధికారులు తనిఖీలు చేసే సమయంలో వాహనాలను గుర్తించి జరిమానాలు విధిస్తున్నారు. అధిక వేగంతో వెళ్లే వాహనాల తీరు నియంత్రించేందుకు స్పీడ్‌గన్ విధానం అమలు చేస్తున్నాం. వివిధ రకాలుగా నంబర్‌ప్లేట్ వాడే వారితోపాటు అధికశబ్దం వచ్చేలా సైలెన్సర్స్ పెట్టే వారిపై చర్యలు తీసుకుంటున్నాం.

– రాహుల్‌హెగ్డే, ఎస్పీ

శాస్త్రీయ విద్యావిధానం అమలు చేయాలి

- టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి శ్రీధర్

గంభీరావుపేట(సిరిసిల్ల): జాతీయ విద్యావిధానం–2020ను రద్దు చేసి, రాజ్యాంగ ఆశయాలకు అనుగుణంగా శాస్త్రీయ విద్యావిధానం అమలు చేయాలని టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి గోల్కొండ శ్రీధర్ డిమాండ్ చేశారు. గంభీరావుపేట మండల కేంద్రంలోని కేజీ టు పీజీ ప్రాంగణంలో ఫెడరేషన్ వార్షిక క్యాలండర్‌ను బుధవారం ఆవిష్కరించారు. కొత్త పెన్షన్ విధానం రద్దు చేసి, పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలన్నారు. సర్వీస్ రూల్స్ ప్రకటించి, పండిట్, పీఈటీ పోస్టులతో సహా పదోన్నతులు కల్పించాలని కోరారు. అన్ని యాజమాన్యాల ఉపాధ్యాయులకు అంతర్ జిల్లా బదిలీలు చేపట్టాలని, పీఆర్‌సీకి సంబంధించి పెండింగ్‌లో ఉన్న అన్ని అంశాలపై ఉత్తర్వులు ఇవ్వాలన్నారు. ప్రతీ పాఠశాలకు స్వచ్ఛ కార్మికులను నియమించాలని కోరారు. మండలశాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సత్తయ్య, అంబేడ్కర్, నాయకులు ఫయిజ్, గంగారం, మనోహర్, వేణు, నారాయణ, సరిత, మంజుల, సుమన్ పాల్గొన్నారు.



క్యాలండర్ ఆవిష్కరిస్తున్న శ్రీధర్, నాయకులు

సుంకరి ఇస్సాదారుల సమస్యలు పరిష్కరించాలి

కోనరావుపేట(వేములవాడ): సుంకరి ఇస్సాదారుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గ్రామాల ఇస్సాదారులు డిప్యూటీ తహసీల్దార్ సత్యనారాయణకు వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా ఇస్సాదారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నీరటి శ్రీనివాస్ మాట్లాడుతూ జిల్లాలో సుమారు 420 మంది సుంకరి పట్టాదారులు ఉండగా నాలుగు వేల మంది ఇస్సాదారులు ఉన్నారన్నారు. జిల్లాలోని అన్ని గ్రామాల్లో సుంకరి ఇస్సాదారులు గ్రామసేవకులుగా కొనసాగిస్తున్నారన్నారు. ఇస్సాదారులను కూడా గ్రామసేవకులుగా గుర్తించాలన్నారు. మంత్రి కేటీఆర్ పట్టాదారుల వివరాలను సేకరించి పంపాలని కోరారని, పట్టాదారులతో ఆటు ఇస్సాదారుల వివరాలను పంపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఇస్సాదారుల సంఘం జిల్లా అధ్యక్షుడు నక్క పర్శరాములు, వీరవేణి తిరుపతి తదితరులు పాల్గొన్నారు.



డిప్యూటీ తహసీల్దార్ సత్యనారాయణకు వినతిపత్రం ఇస్తున్న ఇస్సాదారులు



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ అరుణ



యువ కళాకారుల నృత్య ప్రదర్శన

స్వరాష్ట్రంలోనే కళాకారులకు గుర్తింపు

సిరిసిల్లకల్చరల్: తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు తర్వాతే స్థానిక కళలు, కళాకారులకు గుర్తింపు లభించిందని జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ పేర్కొన్నారు. రాజీవ్‌నగర్‌లోని మినీస్టేడియంలో బుధవారం 26వ జాతీయ యువజనోత్సవాల్లో భాగంగా నిర్వహించిన యువ కళాకారుల ఎంపిక కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జ్యోతి ప్రజ్వలన చేసి మాట్లాడారు. స్వామి వివేకానంద స్ఫూర్తిగా యువత సన్మార్గంలో నడవాలని కోరారు. రాష్ట్ర సాధనలో కీలక పాత్ర పోషించిన కళాకారులకు సీఎం కేసీఆర్ వెన్నుదన్నుగా నిలిచారన్నారు. అనంతరం జానపద గేయాలు, నృత్యాల విభాగంలో యువ కళాకారులు తమ ప్రతిభను చాటుకున్నారు. జిల్లా యువజన క్రీడల అభివృద్ధి అధికారి కె.ఉపేంద్రరావు, మాజీ కౌన్సిలర్ రాపెల్లి లక్ష్మీనారాయణ, అగ్రహారం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

డీఎస్‌వోకు సన్మానం



దేవయ్యను సన్మానిస్తున్న టీచర్లు, ఎస్‌ఎంసీ సభ్యులు

సిరిసిల్లఅర్బన్: సిరిసిల్ల పట్టణంలోని వెంకంపేట జెడ్పీ ఉన్నత పాఠశాల సైన్స్ టీచర్ పాముల దేవయ్య జిల్లా సైన్స్ ఆఫీసర్(డీఎస్‌వో)గా నియమితులవగా పాఠశాలలో బుధవారం ఆయనను సన్మానించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు మల్లేశం, ఎస్‌ఎంసీ చైర్మన్ కమలాకర్, టీచర్లు, ఎస్‌ఎంసీ సభ్యులు పాల్గొన్నారు.

వైద్యశాఖలో ఖాళీల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

సిరిసిల్లకల్చరల్: జాతీయ ఆరోగ్య మిషన్ కార్యక్రమంలో భాగంగా జిల్లా వైద్యారోగ్య శాఖలో ఖాళీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీఎంహెచ్‌వో సుమన్‌మోహన్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. వైద్యుల పోస్టులకు ఎంబీబీఎస్, బీఏఎంఎస్, నర్సు పోస్టులకు 2020కి ముందు బీఎస్సీ నర్సింగ్ ఉత్తీర్ణులై, ఆరు నెలల బ్రిడ్జి కోర్సు పూర్తి చేసినవారు అర్హులని పేర్కొన్నారు. ఎంపికైన డాక్టర్లకు నెలకు రూ.40 వేలు, నర్సులకు రూ.29,900 వేతనం అందిస్తామన్నారు. ఆసక్తి గలవారు ఈ నెల 7న సాయంత్రం 5 గంటల్లోపు తమ బయోడేటాను వైద్యారోగ్య శాఖ కార్యాలయంలో అందజేయాలని సూచించారు.

తెర్లుమద్దిలో సినీనటుడు వేణు



గీత కార్మికుడు విష్ణుతో జబర్దస్త్ వేణు

ముస్తాబాద్(సిరిసిల్ల): ముస్తాబాద్ మండలం తెర్లుమద్దిలో సినీ నటుడు, జబర్దస్త్ కమెడియన్ వేణు సందడి చేశారు. రేణుక ఎల్లమ్మ ఆలయంలో వేణు కుటుంబ సభ్యులు బుధవారం పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. గీత కార్మికుడు వేణుతో సెల్ఫీలు దిగారు.

రేపటి నుంచి శివ దీక్షలు ప్రారంభం

వేములవాడ: రాజన్న సన్నిధిలో శుక్రవారం నుంచి మండల దీక్షలు, 26 నుంచి అర్ధ మండల దీక్షలు ప్రారంభం కానున్నట్లు శివ దీక్షా సేవా సమితి గురుస్వాములు వాసాలమర్రి గోపి, తుమ్మల సంతోష్‌లు బుధవారం తెలిపారు. దీక్షలు చేపట్టే స్వాములు అభిషేక మండపానికి ఉదయం 5 గంటలకు చేరుకోవాలని సూచించారు. గోధుమ రంగు దోవతి, సెల్ల, శివ మాలలు తీసుకురావాలన్నారు. దీక్ష విరమణ ఫిబ్రవరి 15న సాయంత్రం 5 గంటలకు భీమేశ్వరాయలంలో ఉంటుందని పేర్కొన్నారు.

మేళా.. ఉపయోగం భళా!



తయారు చేసిన పరికరాలను ప్రదర్శిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు



పరికరాలను పరిశీలిస్తున్న డీఈవో రాధాకిషన్

- సులభంగా పాఠం అర్థమయ్యేలా ఉపకరణాలు
- ఉపాధ్యాయుల మధ్య పోటీతత్వం
- ఎల్లారెడ్డిపేటలో మేళాను సందర్శించిన డీఈవో

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): విద్యార్థులకు పాఠ్యాంశాలు సులభంగా అర్థం చేయించేందుకు ఉపాధ్యాయులు తయారు చేస్తున్న బోధన ఉపకరణాలు ఎంతగానో ఉపయోగపడుతున్నాయి. విద్యార్థుల్లో ఆసక్తి పెంచడం, వారిలో అభ్యసన సామర్థ్యాలు పెంచడమే లక్ష్యంగా ప్రభుత్వం టీఎల్‌ఎం(టీచింగ్, లెర్నింగ్ మెటీరియల్) ఉపయోగించాలని సూచించింది. ఇందులో భాగంగానే టీఎల్‌ఎం మేళాను ఏర్పాటు చేసింది. జిల్లా వ్యాప్తంగా అన్ని మండల కేంద్రాల్లో మంగళ, బుధవారాలు రెండు రోజులపాటు టీఎల్‌ఎం మేళాను నిర్వహించింది. 'లో కాస్ట్.. నో కాస్ట్' కాన్సెప్ట్‌తో ఈ మేళా నిర్వహిస్తున్నారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ ఉపయోగాలు ఉండేలా బోధన ఉపకరణాలు తయారు చేయాలనేది ముఖ్య ఉద్దేశం.

పరిశీలించిన డీఈవో

రెండో రోజు బుధవారం ఎల్లారెడ్డిపేటలోని మేళాను జిల్లా విద్యాధికారి రాధాకిషన్ పరిశీలించారు. డీఈవో మాట్లాడుతూ ఉపాధ్యాయులు తయారు చేసిన పరికారులు విద్యార్థుల ఉన్నతికి ఉపయోగపడతాయన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో విద్యార్థుల దృష్టిని విద్యపైకి మళ్లించేందుకు ఇలాంటి ప్రదర్శనలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. అట్టముక్కలు, చిన్నవాలు, బల్బ్, బ్యాటరీతో తయారు చేయడం, ఆంగ్ల పదజాలం అభివృద్ధి, ప్రొఫెషన్స్ సులభంగా అర్థం చేసుకోవడానికి బోధన పరికరాలు ఉపయోగపడుతున్నాయన్నారు. నిర్వాహకులు హన్మండ్లు, ప్రశాంత్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

దాదాపు 600 ప్రదర్శనలు

ఈ మేళాలో దాదాపు వంద మంది టీచర్లు తాము తయారు చేసిన ఉపకరణాలను ప్రదర్శించారు. రెండు రోజుల్లో దాదాపు 600 బోధన ఉపకరణాలు మేళాలో ప్రదర్శించారు. తెలుగు, ఆంగ్లం, గణితం, పరిసరాల విజ్ఞానం నుంచి సబ్జెక్టుకు ముగ్గురి చొప్పున జిల్లాస్థాయికి ఎంపిక చేశారు.

సంఖ్యలను పోల్చడానికి



ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు సంఖ్య భావన ఏర్పాటు చేయడం, నూతన సంఖ్యల ఏర్పాటుకే ఈ ప్రదర్శన. సంఖ్య లను పోల్చడానికి, స్థానం విలువలు తెలియజేయడానికి ఈ ఉపకరణం ఉపయోగపడుతుంది. అట్ట ముక్కలు, చార్టులతో తయారుచేసి ప్రదర్శన. దీంతో విద్యార్థులకు సంఖ్యలపై అవగాహన పెరుగుతోంది.

– ఎం.సునిత, ఉపాధ్యాయిని

రాత్రి, పగలుపై అవగాహన



ఒకటి నుంచి 5వ తరగతి విద్యార్థులకు రాత్రి పగలు ఏర్పాటు గురించి బల్బు, బ్యాటరీతో ఈ ప్రదర్శనను తయారుచేశా. భూభ్రమణం గురించి సులభంగా అవగాహన పెరుగుతుంది. అట్టముక్కలు, చిన్నబాలును ఉపయోగించడంతో ఈ ఆకారం ఏర్పడింది. చిన్నతనంలోనే విద్యార్థులకు ఈ ప్రదర్శన ఎంతో ఉపయోగపడుతుంది.

– ఎం.రజిత, ఉపాధ్యాయిని

ఆంగ్ల పదజాలం అభివృద్ధి



ఆంగ్ల పదజాలం అభివృద్ధి, చెట్టు ఉపయోగాలు, ప్రెపొజిషన్స్ సులభంగా అవగాహన చేసుకోవడానికి ఉపయోగపడుతుంది. అట్టముక్కలు క్రెయాన్స్ ద్వారా తయారుచేశా. తక్కువ ఖర్చుతో ఈ ప్రదర్శనలు విద్యార్థుల అభ్యసన స్థానాలను పెంపొందించడానికి దోహదపడతాయి. మేళాలకు విశేష స్పందన వచ్చింది.

– పాముల రాజు, ఉపాధ్యాయుడు

'సెస్' గెలుపు కార్యకర్తలకు అంకితం

- బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య



మాట్లాడుతున్న ఆగయ్య

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): జిల్లాలో ఏ ఎన్నికలు వచ్చినా బీఆర్‌ఎస్‌దే గెలుపని, సెస్ డైరెక్టర్ స్థానాల గెలుపును కార్యకర్తలకు అంకితమిస్తున్నట్లు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య తెలిపారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో పార్టీ మండలశాఖ ఆధ్వర్యంలో సెస్ డైరెక్టర్ కృష్ణహరి విజయోత్సవ కృతజ్ఞత సభ బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనను ఘనంగా సత్కరించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆగయ్య మాట్లాడుతూ.. కృష్ణహరి విజయానికి సమష్టిగా కృషి చేసిన కార్యకర్తలు వచ్చే ఎన్నికలు కూడా పార్టీ ఎవరికి అవకాశం ఇచ్చినా వారి గెలుపునకు కష్టపడి పని చేయాలని కోరారు. రాష్ట్ర ఐటీశాఖ మంత్రి కేటీఆర్ నాయకత్వంతో అందరూ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు లక్ష్మణ్‌రావు, ఎంపీపీ రేణుక, సింగిల్‌విండో చైర్మన్ కృష్ణారెడ్డి, వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, నాయకులు అంది సుభాష్, ఎలుసాని మోహన్, కొండ రమేశ్, నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి నృత్య పోటీల్లో ప్రతిభ



అనూష యశస్విని నృత్య ప్రదర్శన

సిరిసిల్లకల్చరల్: సావిత్రీబాయి పూలే జయంతి సందర్భంగా రాష్ట్రస్థాయిలో నిర్వహించిన నృత్య ప్రదర్శన పోటీల్లో జిల్లా కేంద్రానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయిని అనూష యశస్విని ప్రతిభ కనబరిచారు. తృతీయ స్థానం సాధించడంతోపాటు రూ.3 వేల నగదు బహుమతి గెలుచుకున్నారు. హైదరాబాద్ యూనివర్సిటీ ఆడిటోరియంలో ఈ నెల 2, 3వ తేదీల్లో ఈ పోటీలు నిర్వహించారు. విజ్ఞాన దర్శిని ఉమెన్స్ ఫెస్ట్ పేరిట రాష్ట్ర మహిళా కమిషన్ నిర్వహించిన పోటీల్లో రాష్ట్రవ్యాప్తంగా మహిళా టీచర్లు పాల్గొన్నారు. కొండాపూర్ జెడ్పీహెచ్‌ఎస్‌లో ఆంగ్లం ఉపాధ్యాయురాలిగా పని చేస్తున్న అనూష యశస్విని కూచిపూడి నృత్యం ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆమెను టీఎస్‌టీఎస్ చైర్మన్ పి.జగన్మోహన్‌రావు, మహాత్మా హెల్పింగ్ హ్యాండ్స్ గంట రవీందర్, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ప్రతిభాలక్ష్మి, జయరాజ్, కృష్ణకుమారి తదితరులు అభినందించారు.

జెడ్పీ చైర్‌పర్సన్‌ను కలిసిన కోనరావుపేట డాక్టర్



చైర్‌పర్సన్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న డాక్టర్ వేణుమాధవ్

సిరిసిల్ల: రాజన్న సిరిసిల్ల జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణను సిరిసిల్ల క్యాంపు ఆఫీస్‌లో కోనరావుపేట పీహెచ్‌సీ డాక్టర్ వేణుమాధవ్ బుధవారం కలిసి, నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కోనరావుపేట పీహెచ్‌సీలో డాక్టర్‌గా నియమితులైన వేణుమాధవ్ మర్యాదపూర్వకంగా కలిశారు. కొత్తగా వచ్చిన డాక్టర్‌కు, సిబ్బందికి మా సహకారం ఉంటుందని అరుణ స్పష్టం చేశారు. కోనరావుపేట ఎంపీపీ ఎదురుగట్ల చంద్రయ్యగౌడ్, టీఆర్‌ఎస్ నాయకులు న్యాలకొండ రాఘవరెడ్డి ఉన్నారు.

క్షణికావేశంలో యువకుడి ఆత్మహత్యాయత్నం

- సకాలంలో వచ్చి కాపాడిన పోలీసులు
- తండ్రీకుమారుడి మధ్య గొడవే కారణం



కౌన్సెలింగ్ చేస్తున్న హెడ్‌కానిస్టేబుల్ ఫసియొద్దీన్

ముస్తాబాద్(సిరిసిల్ల): వృథా ఖర్చులు మానుకోవాలని.. సన్మార్గంలో నడవాలని చెప్పిన తండ్రి మాటలకు నొచ్చుకున్న ఓ యువకుడు క్షణికావేశంలో ఆత్మహత్యాయత్నం చేశాడు. పోలీసులు సకాలంలో రావడంతో ప్రాణాలతో బయటపడ్డాడు. హెడ్‌కానిస్టేబుల్ ఫసియొద్దీన్ తెలిపిన వివరాల ప్రకారం.. ముస్తాబాద్ మండల కేంద్రానికి చెందిన సూర కొంరయ్యకు అతని కొడుకు కుమార్‌కు మధ్య బుధవారం గొడవ జరిగింది. డబ్బులు వృథాగా ఖర్చు చేయొద్దని తండ్రి మందలించాడు. అప్పులు తీర్చేందుకు స్థలాన్ని విక్రయించగా వచ్చిన డబ్బులను సైతం కుమారుడు అడగడంతో అతను నిరాకరించాడు. దీంతో ఇద్దరి మధ్య ఘర్షణ వాతావరణం చోటుచేసుకుంది. క్షణికావేశంలో కుమార్ బైక్‌పై పెట్రోల్ పోసి, నిప్పంటించేందుకు ప్రయత్నించాడు. కొంరయ్య అడ్డుకొని, కుమారుడిపై కోపగించుకున్నాడు. దీంతో కుమార్ అందరూ చూస్తుండగానే ఇంట్లోకి వెళ్లి, గడియ పెట్టుకున్నాడు. చీరతో ఉరేసుకొని, వేలాడుతున్నాడు. అదే సమయానికి అక్కడికి చేరుకున్న పోలీసులు తలుపులు బద్దలు కొట్టి, ఫ్యాన్‌కు వేలాడుతున్న కుమార్‌ను కిందికి దించారు. సపర్యలు చేయడంతో అతను ప్రాణాలతో బయటపడ్డాడు. అనంతరం తండ్రీకుమారుడికి కౌన్సెలింగ్ చేశారు. ఎలాంటి గొడవలు పెట్టుకోవద్దని, కుటుంబాన్ని, తల్లిదండ్రులను గౌరవించాలని కుమార్‌కు సూచించారు. పోలీసులు సకాలంలో రావడం వల్లే తమ కుమారుడు దక్కాడని కొంరయ్య దంపతులు విలపించారు. వారికి కృతజ్ఞతలు తెలిపారు.

నాంపల్లి ఆలయ ఉద్యోగి మృతి



వేణుగోపాల్‌రావు (ఫైల్)

వేములవాడఅర్బన్: వేములవాడ పట్టణానికి చెందిన బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఐల్నేని సుధాకర్‌రావు తనయుడు వేణుగోపాల్‌రావు(48) అకస్మాత్తుగా మృతి చెందారు. వివరాల్లోకి వెళ్తే.. వేణుగోపాల్‌రావు వేములవాడ రాజన్న అనుబంధ నాంపల్లి శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో 15 ఏళ్లుగా జూనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్నారు. గత 35 రోజులుగా అయ్యప్ప దీక్షలో ఉన్న ఆయనకు రెండు రోజులుగా విరేచనాలు అవుతున్నాయి. ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. మార్కెట్ కమిటీ చైర్మన్ ప్రభాకర్‌రావు, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు ఏనుగు మనోహర్‌రెడ్డి, నాంపల్లి ఆలయ ఇన్‌చార్జి నరేందర్, అర్చకులు విజయ్‌లు వేణుగోపాల్‌రావు మృతదేహానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. బాధిత కుటుంబసభ్యులకు తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు.

రెండు వ్యాన్‌లు ఢీ

- క్యాబిన్‌లో చిక్కుకున్న డ్రైవర్
- ఆస్పత్రికి తరలింపు



క్యాబిన్‌లో చిక్కుకున్న డ్రైవర్

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఎల్లారెడ్డిపేట మండలకేంద్రం శివారులోని కేసీఆర్‌కాలనీ సమీపంలో బుధవారం రెండు డీసీఎం వ్యాన్‌లు ఢీకొట్టుకున్న సంఘటనలో ఇద్దరు గాయపడ్డారు. ఓ వ్యాన్‌లో ఉన్న డ్రైవర్ అబ్దుల్‌గఫూర్ క్యాబిన్‌లో చిక్కుకోగా స్థానికులు బయటకు తీసి, సిరిసిల్ల ఏరియా ఆస్పత్రికి తరలించారు. మహారాష్ట్రలోని నాగ్‌పూర్ నుంచి దారం ఉండాలు వేసుకుని సిరిసిల్ల వైపునకు వస్తున్న ఓ వ్యాన్ ఎదురుగా వస్తున్న మరో వ్యాన్ అతివేగంగా వచ్చి ఢీకొట్టింది. ప్రమాదంలో నాగ్‌పూర్ నుంచి వస్తున్న వ్యాన్ డ్రైవర్ గఫూర్ తీవ్రంగా గాయపడ్డారు. మరొకరు స్వల్పంగా గాయపడ్డారు. ఇద్దరిని ఆస్పత్రికి తరలించి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బందనకల్ బడిలో నీటి గోస



బందనకల్ జెడ్పీ ఉన్నత పాఠశాల

ముస్తాబాద్(సిరిసిల్ల): మండలంలోని బందనకల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నీరు కరువైంది. బడికి చెందిన బోరు మోటార్ వారం రోజుల క్రితం కాలిపోయింది. దీంతో మధ్యాహ్న భోజనం వంటలకు కార్మికులు ఇబ్బంది పడుతున్నారు. మూత్రశాలలు, మరుగుదొడ్లకు నీటి సరఫరా నిలిచిపోయింది. విద్యార్థులు నీటిని ఇంటి నుంచే బాటిళ్లలో తెచ్చుకుంటున్నారు. గత సోమవారం నుంచి నీటికి కోసం నానాతంటాలు పడుతున్నట్లు ఎస్‌ఎంసీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. సమస్యను పరిష్కరించాలని పంచాయతీ పాలకవర్గం, అధికారులను కలిశామన్నారు. బోరు మోటార్‌ను పాఠశాల అవసరాలకు మాత్రమే వినియోగించేలా చూడాలని కోరినట్లు తెలిపారు. నెల రోజులకోసారి మోటారు కాలిపోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. 152 మంది విద్యార్థులున్న పాఠశాలలో నీటి సమస్య శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

వ్యాక్సినేషన్‌పై దృష్టిసారించాలి



ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): వ్యాధుల నివారణకు నిరంతరం వ్యాక్సినేషన్‌పై దృష్టి సారించాలని రాష్ట్ర వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్ (డబ్ల్యూహెచ్‌వో) పరిశీలకులు డాక్టర్ అతుల్ పేర్కొన్నారు. ఎల్లారెడ్డిపేటలోని పీహెచ్‌సీని బుధవారం తనిఖీ చేశారు. ఆస్పత్రిలోని మందులు, రోగుల రికార్డులు, వ్యాక్సిన్ కోల్డ్ చైన్ సిస్టంలను పరిశీలించారు. వ్యాక్సినేషన్‌పై ఏఎన్‌ఎంలకు సూచనలు, సలహాలు ఇచ్చారు. డాక్టర్ అతుల్ మాట్లాడుతూ కరోనా కష్టకాలంలో వ్యాక్సినేషన్ ప్రజలకు ఎంతో ఉపయోగపడిందన్నారు. వ్యాధులపై నిర్లక్ష్యం చేస్తే ప్రాణాలు పోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ప్రజలు కోవిడ్ నిబంధనలు పాటించేలా అవగాహన కల్పించాలని సూచించారు. సూపరింటెండెంట్ బాబు, వైద్యురాలు స్రవంతి, వైద్యసిబ్బంది ఉన్నారు.

దాడి ఘటనలో నిందితులపై కేసు

సారంగాపూర్(జగిత్యాల): బీర్‌పూర్ మండలంలోని నర్సింహులపల్లె శివారు ఇందిరానగర్‌లో పూదూరి పోషయ్య కుటుంబసభ్యులపై దాడి చేసినవారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై అజయ్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. పోషయ్యకు చెందిన పైప్‌లైన్‌ను అదే గ్రామానికి చెందిన పూదూరి ఇందయ్య బుధవారం ధ్వంసం చేశాడు. అనంతరం పోషయ్యను, ఆయన భార్య, కోడలిని ఇందయ్య, ఆయన కుటుంబ సభ్యులు అసభ్య పదజాలంతో దూషించి, దాడి చేశారు. ఈ ఘటనలో బాధితులకు గాయాలయ్యాయి. వారి ఫిర్యాదు మేరకు నిందితులపై కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

విదేశీ విద్యకు ఆర్థికసాయం

సిరిసిల్లకల్చరల్: విదేశాల్లో విద్యాభ్యాసం చేసే జిల్లాలోని మైనార్టీ విద్యార్థులకు ప్రభుత్వం ఆర్థిక సాయం చేసేందుకు నిర్ణయించింది. చీఫ్ మినిస్టర్ ఓవర్సీస్ పథకం కింద ఫారిన్ యూనివర్సిటీల్లో పీహెచ్‌డీ, పీజీ కోర్సులు చదువుకునే వారికి ఉపకార వేతనం కోసం అర్హుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి టి.శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. www.telanganaepass.gov.in వెబ్‌సైట్‌లో పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. పూర్తి వివరాల కోసం 99497 74639 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

కానిస్టేబుల్, ఎస్సై మెయిన్స్‌కు ఉచిత శిక్షణ

సిరిసిల్లకల్చరల్: పోలీస్ కానిస్టేబుల్, ఎస్సై పోస్టులకు ఎంపికలో భాగంగా ప్రిలిమ్స్, ఈవెంట్స్‌లో అర్హత సాధించిన అభ్యర్థులకు మెయిన్స్ పరీక్షల కోసం బీసీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు స్టడీ సర్కిల్ డైరెక్టర్ జెల్ల వెంకటస్వామి ఒక ప్రకటనలో తెలిపారు. తరగతులు ఈ నెల 6 నుంచి ప్రారంభిస్తున్నామని అన్నారు. 75 శాతం హాజరు చూపిన ప్రతీ అభ్యర్థికి ప్రతినెలా రూ.1,000 స్టైపెండ్ ఇస్తామని పేర్కొన్నారు. ఆసక్తి గలవారు తమ పూర్తి వివరాలతో స్టడీ సర్కిల్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

వరి నారుకు వానరాల బెడద



నారుమడిలో కోతులు

గంభీరావుపేట(సిరిసిల్ల): వానరాలు రైతులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. యాసంగి సాగు కోసం అన్నదాతలు వరి నారు మడులు సిద్ధం చేసుకున్నారు. కోతులు గుంపులుగా ఆ మడుల్లో చేరి, వరి గింజలను తినడం, మొలకలను తొలగించడం చేస్తున్నాయి. కోతుల బెడద నుంచి నారును రక్షించుకునేందుకు రైతులు నానాతంటాలు పడుతున్నారు.

హామీని మరిచారా మంత్రిగారూ?

- మురికి కాలువ నిర్మాణంపై ఫ్లెక్సీలతో వెంకటాపూర్‌వాసుల నిరసన



ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మండలంలోని వెంకటాపూర్‌లో మురికి కాలువ నిర్మాణానికి 2017లో మంత్రి కేటీఆర్ హామీ ఇచ్చి, మరిచారని గ్రామస్తులు తెలిపారు. హామీని మరిచారా అంటూ గ్రామ కూడళ్లలో గురువారం ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి, తమ నిరసన తెలిపారు. ఇళ్ల మధ్య నుంచే మురికి నీరు పారుతున్నప్పటికీ స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. హామీ ఇచ్చిన మంత్రి కూడా సమస్యను పరిష్కరించకపోవడం బాధాకరమన్నారు. ఇప్పటికైనా శాశ్వత మురికి కాలువ నిర్మించి, తమను రోగాలబారి నుంచి కాపాడాలని కోరారు. ఉపసర్పంచ్ మేడిశెట్టి బాలయ్య, వార్డు సభ్యులు గుర్రాల రాజు, గడ్డం రవి, పూర్ణచందర్, స్థానికులు ఉన్నారు. కాగా రాత్రి పోలీసులు వెంకటాపూర్‌కు వచ్చి, ఫ్లెక్సీలను తొలగించారు. దీంతో స్థానికులు వారితో వాగ్వాదానికి దిగారు.

తాళం వేసిన ఇళ్లలో దొంగతనం

మెట్‌పల్లి(కోరుట్ల): కొండ్రికర్లలో వెంకటేశ్ అనే రైతు ఇంట్లో దొంగతనం జరిగింది. వివరాల్లోకి వెళ్తే.. వెంకటేశ్ బుధవారం ఇంటికి తాళం వేసి, కుటుంబసభ్యులతో కలిసి పొలం పనులకు వెళ్లాడు. మధ్యాహ్నం వచ్చేసరికి తాళం పగులగొట్టి ఉంది. లోపలికి వెళ్లి చూడగా, బీరువాలో దాచిన రూ.6 లక్షల తోపాటు మూడు తులాల బంగారం కనిపించలేదు. చోరీ జరిగినట్లు గుర్తించి, పోలీసులకు ఫిర్యాదు చేయగా సంఘటన స్థలాన్ని పరిశీలించారు.

రాయికల్(జగిత్యాల): ఒడ్డెలింగాపూర్‌లో తాళం వేసిన ఇంట్లో దొంగలు పడి, బంగారం, సిలిండర్ ఎత్తుకెళ్లారు. ఎస్సై కిరణ్‌కుమార్ వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మంజుల రాజ్‌కుమార్ మంగళవారం ఇంటికి తాళం వేసి, కుటుంబసభ్యులతో కలిసి కొండగట్టులోని బంధువుల ఇంటికి వెళ్లాడు. అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చొరబడి, తులం బంగారం, గ్యాస్ సిలిండర్ చోరీ చేశారు. బుధవారం తిరిగి వచ్చిన బాధితులు దొంగతనం జరిగినట్లు గుర్తించారు. రాజ్‌కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.